చింతపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వారపు సంత రోజు కావడంతో హఠాత్తుగా పడిన వర్షం కారణంగా సంతకు వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షంతో వ్యవసాయ భూములకు తాత్కాలిక ఉపశమనం లభించనుంది. రోడ్లు జలమయం కావడంతో ప్రజలు ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు ఇంటి లోపల ఉండటం చాలా సురక్షితమని, విద్యుత్ స్తంభాలు, పాడుబడిన భవనాలు, చెట్లు, కొండలు లేదా ఇతర ఎత్తైన ప్రదేశాలకు దూరంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు.

కురుస్తున్న వర్షం

జాతీయ రహదారిపై..

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

-బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలి

-బంధువులు, సిపిఎం నేతల ఆందోళన

ఆందోళన చేపడుతున్న సిపిఎం నేతలు, బంధువులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి చెందిన ఘటన అందరిని కలచి వేసింది. భార్యాభర్తలు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలంలో మనువాడికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం.... డుంబ్రిగూడ మండలం పాముల పుట్ట గ్రామానికి చెందిన గెమ్మెలినూకరాజు, ధసుద, దంపతులు మనవడు అభిషేక్‌తో కలిసి కోట్నాపల్లి చర్చిలో ప్రార్ధనకు వెళ్లి తమ గ్రామానికి వస్తున్నారు. అరకు నుండి చింతపల్లి వెళుతున్న ట్రాలీ, జాతీయ రహదారికి చెందిన వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే ఇద్దరూ మృతి చెందారు. వారితో ప్రయాణిస్తున్న మనవడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుకుంపేట పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించారు. ఎస్సై ఎల్.సురేష్ మృతదేహాలను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న దంపతుల బంధువులు బుధవారం మధ్యాహ్నం హుకుంపేట పోలీస్ స్టేషన్ రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. ఈ ఘటనకు కారణమైన హైవే అధికారుల పై చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గాయపడిన మనవడు అభిషేక్‌కి మెరుగైన వైద్యం అందించాలని లేకపోతే మృతదేహాలను తమ గ్రామానికి తీసుకు వెళ్లలేమని బైఠాయించారు. సీఐ సన్యాసినాయుడు, ఎస్సై సురేష్ జాతీయ రహదారి అధికారులతో మాట్లాడారు. తీవ్రంగా గాయపడిన బాలుడుకి చికిత్స నిమిత్తము 10 లక్షలు ఇస్తామని జాతీయ రహదారి అధికారులు ఒప్పుకోవడంతో బంధువులు మృతదేహాలను తమ గ్రామానికి తరలించారు.

రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి : సిపిఎం నేతల ర్యాలీ

హుకుంపేట: జాతీయ రహదారిపై మృతి చెందిన దంపతుల కుటుంబ సభ్యులకు 50లక్షల నష్టపరిహారం చెల్లించాలని, లేకుంటే పనులు అడ్డుకుంటామని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స హెచ్చరించారు. మండల కేంద్రంలో నుండి పోలీస్ స్టేషన్ బజార్ సెంటర్ వరకు భారీ ర్యాలీని సిపిఎం నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనరస మాట్లాడుతూ, ఎస్ఆర్‌సి కంపెనీ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భద్రత చర్యలు తీసుకోవడంలో బాధ్యతా రహితంగానూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రహదారి పనుల సందర్భంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆదివాసుల పట్ల చులకన భావంతో వ్యవహరించడం సరి కాదని హెచ్చరించారు. మృతి చెందిన నూకరాజు కుటుంబానికి 50 లక్షలు రూపాయలు ఇవ్వాలని పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు ఆందోళన చేపడుతున్నా ఎస్ ఆర్ సి కంపెనీ యాజమాన్యం ప్రత్యక్షంగా రాకుండా పోలీసులతో రాయబారం చేస్తూ కాలయాపన చేసిందన్నారు. చివరికి దిగివచ్చిన కంపెనీ యాజమాన్యం 10 లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇస్తూ పోలీస్‌ల సమక్షంలో ఒప్పుకున్నారు. జాతీయ రహదారి పనుల సందర్భంగా భద్రతపరమైన చర్యలు తీసుకోకుండా ప్రమాదం జరిగినప్పుడల్లా చేతులు తెలుపుకుంటూ స్థానిక ప్రజలకు అన్యాయం చేస్తామంటే చూస్తూ ఊరుకోడానికి ఆదివాసి ప్రజానీకం సిద్ధంగా లేరని తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఎస్ ఆర్ సి కంపెనీపై ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, గిరిజనులు డిమాండ్ చేశారు. సీపీఎం డుంబ్రిగూడ మండల కార్యదర్శి పోతురాజు, గసభ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ బాబు మాట్లాడుతూ, నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలకు ఎస్ఆర్‌సి కంపెని కారణమవుతుందన్నారు. వీటిపై బాధిత కుటుంబాలు ప్రశ్నిస్తే కంపెనీ యజమానులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. జిల్లా అదనపు ఎస్పీ స్పందిస్తూ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి పది లక్షల రూపాయల నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ హైమావతి, కుటుంబ సభ్యులు, కితలంగి సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

జీడి మామిడి రైతులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత సూరిబాబు

జీడి పిక్కలను జిసిసి ద్వారా కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

ఏజెన్సీలో గిరిజనులు పండించే జీడి పిక్కలను ప్రభుత్వం జిసిసి ద్వారా కొనుగోలు చేసి గిరజనులు దళారుల చేతులు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎస్.సూరిబాబు డిమాండ్ చేశారు. జీడి రైతులను బుధవారం సూరిబాబు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జీడిమామిడి తోటలు ఐదువేల ఎకరాలకు పైబడి గిరిజనులు సాగుచేస్తున్నారని తెలిపారు. గిరిజన కుటుంబాలు సంవత్సరమంతా కష్టపడి జీడి చెట్లకు సంరక్షణ చేస్తున్నారని, తీరా పంట చేతికి వచ్చే సమయంలో దళారులు కుమ్మక్కై మార్కెట్ ధర కన్నా తక్కువకు జీడిపిక్కలను కొనుగోలు చేస్తున్నారని, తూనికలలో కూడా మోసం చేస్తూ దళారులు గిరిజనులకు మోసం చేస్తున్నారని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి కేజీ జీడిపిక్కలు రూ.200కు కొనుగోలు చేసేలా మద్దతు ధర ప్రకటించి, ఆ ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనులు మూఢనమ్మకాలను విడనాడాలి

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో ప్రజలు మూఢ నమ్మకాలను వీడనాడాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు రెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం లోతేరు పంచాయతీ డుంబ్రిగూడ గ్రామానికి చెందిన ఎడారి డోంబు సజీవ దహనం గురి అయిన నేపథ్యంలో పోలీసుల సహకారంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో లోతేరులో సందర్శించి మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. మూఢనమ్మకాలపై జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు శ్రీరాములు గిరిజన ప్రాంతంలో జరుగుతున్న మూఢనమ్మకాలపై మోసాలపై వివిధ రకాల మ్యాజిక్ షో ద్వారా గిరిజనులు, విద్యార్థులకు చైతన్యం పరిచారు. సైన్స్ ను నమ్మాలని మూఢనమ్మకాలను వీడాలని ఇలాంటి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తుంటామని తెలిపారు. గిరిజనులు ఎవరికైనా అనారోగ్యం బాగో లేనప్పుడు ఆస్పత్రికి వెళ్లి డాక్టర్ను చూపించుకోవాలని అప్పుడే జబ్బు నయమవుతాయని తెలిపారు. మూఢనమ్మకాలు నమ్మి గురువులను, పూజలు దగ్గర వెళ్లి వాళ్ళు చెప్పే మాయమాటలకు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ సందర్భంగా అనంతగిరి ఎస్ఐ, డి శ్రీనివాస్, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ, పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఇంటి పక్కనే మేకలు, ఆవులు, పందులు పెంచడం పరిశుభ్రత పాటించకపోవడంతో మలేరియా, డయేరియా, జ్వరాలు వంటి అనేక జబ్బులు బారిన పడి మూడ నమ్మకాలకు గురువులను సంప్రదిస్తుంటారని జబ్బు తగ్గకపోతే ఆసుపత్రికి తీసుకెళ్తుంటారని చెప్పారు. అరకులోయ మండలంలోని లోతేరు పంచాయితి డుంబ్రిగుడ గ్రామంలో చేతబడి చేస్తున్నాడని అడారి డోంబు ను పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన వ్యక్తులకు సుమారు 20 ఏళ్ళ వరకు జైలు శిక్ష పడుతుందని చెప్పారు. గ్రామంలో ఈ మధ్య కాలంలో ఇద్దరు వ్యక్తులు చనిపోయారన్నారు.. ఆనారోగ్యం తగ్గక పోవడంతో విషం తాగి చనిపోయిందని విచారణలో తేలిందన్నారు. మరో వ్యక్తి అనారోగ్యం బాగోలేక విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిందన్నారు. దీనికి కారణం చేతబడి చేశారనే అనుమానంతో గ్రామస్తులు దాడి చేసి పెట్రోల్ పోసి సజీవ దహనం చేసినట్లుగా గుర్తించడం జరిగిందన్నారు. గ్రామంలో సెల్ సిగ్నల్ ఉన్నప్పటికీ పోలీసులకు, గ్రామ పెద్దలకు సమాచారం అందించలేదన్నారు. సమాచారం అందించి ఉంటే ప్రాణం దక్కి ఉండేదని అన్నారు. మూఢనమ్మకాలతో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుబాయ్ కళావతి, జన విజ్ఞాన వేదిక సభ్యుడు డిగ్రీ కళాశాల ఉపాధ్యాయుడు డాక్టర్ శోభన్ బోడ్నాయిక్, పాస్టర్ ఇసాక్, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు కిల్లో రామన్న, ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ పట్టాసి దీప్తి, విఆర్ఓ నాగేశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ తాతబాబు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

మ్యాజిక్ చేస్తున్న మ్యూజీషియన్

సీనియర్ అసిస్టెంట్ సతీష్‌కి నివాళి

ప్రజాశక్తి పాడేరు : సీనియర్ అసిస్టెంట్ బి.సతీష్ అకాల మృతి తీరని లోటని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ అన్నారు. కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ సతీష్ విశాఖపట్నం బుధవారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సతీష్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్, డి. ఆర్. ఓ కె. పద్మలత పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జె.సి. మాట్లాడుతూ, సతీష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలయ జేసారు. కలెక్టరేట్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తామని కలక్టరేట్లో ఉన్న అన్ని విభాగాల ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ కె. పద్మలత, కలెక్టరేట్ సూపరిండెంట్ సి.హెచ్. తిరుమల రావు, పాడేరు తహశీల్దార్ వి. త్రినాదరావు నాయుడు, డిపి ఆర్ ఓ పి. గోవిందరాజులు, డివిజనల్ పి ఆర్ఓ పండు రాములు, జిల్లా పౌర సరఫరాల అధికారి బి.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ సీటు పొందిన విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని పోచవరం కాలనీ గ్రామానికి చెందిన పొంది హవినయ నందన్ భీమవరం శ్రీస్వామి వివేకానంద స్కూల్లో కోచింగ్ తీసుకొని నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణులై సీటు దక్కించుకున్న నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు 'కాకునూరు కృష్ణార్జునరావు బుధవారం స్వీట్ తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గత 18 సంవత్సరాల నుంచి విద్యార్థులకు నవోదయ కోచింగ్ ఇస్తున్నామని, ఇప్పటివరకు ఎంతోమంది విద్యార్థులు నవోదయ, ఏకలవ్య పాఠశాలల్లో సీట్లు పొందారని తెలిపారు. అతి తక్కువ ఫీజులతో పేద విద్యార్థులకు నవోదయ శిక్షణ ఇస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవోదయ సీటు సాధించిన విద్యార్థి హవినయ నందన్‌కు సీపీఎం నాయకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందన్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం అందిస్తున్న సిటిజన్స్ సంస్థ ప్రతినిధులు, సర్పంచ్

మృతుని కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి గంగవరం : గంగవరం మండలం, రాజవరం గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మరణించిన తుంపల పరుశురాము కుటుంబానికి సిటిజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ చేయూతను అందించింది. పరుశురాము కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.2000 నగదు సంస్థ కార్యదర్శి నిడమర్తి సుజాత, సూరంపాలెం సర్పంచ్ బల్లెం శివ దొర చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ నిడమర్తి చిన్నబాబు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ఇదే గ్రామంలో అగ్ని ప్రమాదం వల్ల దళిత కుటుంబాలు సర్వం కోల్పోయాయని, ఆ కుటుంబంలో వ్యక్తి చనిపోవడంతో తీరని లోటు అని, ఆ కుటుంబాన్ని ఎంతో కొంత ఆదుకోవాలని ఉద్దేశంతో సిటిజన్ సంస్థ ఈ సహాయం అందించినట్లు చెప్పారు. దాతృత్వం కలిగిన వ్యక్తులు పరుశురాము కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కరీముఖిపుట్ పంచాయతీ వెచ్చంగి గ్రామంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు జి.నారాయణ, జి.జీనబందు సందర్శించారు. గ్రామస్తుల సమస్యలను అడగగా ప్రధానంగా తాగునీటి, రహదారి, సిసి రోడ్డు, డ్రైనేజీ ల సమస్యలతో గ్రామంలో నివసిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులంతా ఏకమై ప్రజాప్రతినిధుల దృష్టికి మంచినీరు సమస్య పరిష్కారంకు అనేక సార్లు చెప్పినా ఫలితం లేదన్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ నాయకులు జి జీనబంద్ మాటాడుతూ వెచ్చంగి గ్రామంలో అధికారులు తక్షణమే చర్యలు తీసుకోని పనులు వేగవంతం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో త్రాగునీరు లేక, ఊట గడ్డ నుండి సేకరించి బురద నీరే త్రాగునీరుగా వాడుతూ అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. సంబంధాలు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని .. సిపిఎం మండల కార్యదర్శి కర్ర త్రినాథ్ పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు వచ్చి వారి సమస్యలపై ఎమ్మెల్యేకు నేరుగా వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకనుంచి ప్రతి బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బుధవారం నాటి ప్రజా దర్బార్‌లో 41 వినతులు వచ్చాయన్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపుతామని పేర్కొన్నారు. ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామస్తులు రోడ్డు సౌకర్యం, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, పట్టుచీర గ్రామంలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణం చేపట్టాలని, రంపచోడవరం మండలం దబ్బవలస గ్రామస్తులు రేషన్ డిపోను మంజూరు చేయాలని, విఆర్ పురం గ్రామానికి చెందిన ముత్యాల లక్ష్మి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కావాలని, పెద్ద గెద్దాడ గ్రామస్తులు చెక్ డ్యాం నిర్మాణం చేయాలని వినతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్, టిడిపి మండలం ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు, వై నిరంజనీదేవి, పుట్టి రమేష్, బాపన్న దొర తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

అంగన్వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్త, మినీ అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ సంధ్యారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం మండలం ఎం.బూరిగబందలో మినీ అంగన్వాడీ కార్యకర్త, ఇసుకపట్ల, రంప గ్రామాల్లో ఆయా, దేవీపట్నం మండలం దేవారంలో అంగన్వాడీ కార్యకర్త, దండంగి, తోయ్యేరు-1, సిహెచ్.భీంపల్లి గ్రామాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 26 నుండి ఏప్రిల్ 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు తమ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. స్థానిక నివాసం, ఎస్టీ సామాజిక తరగతికి చెందిన వివాహిత స్త్రీ అభ్యర్థులు దీనికి అర్హులని, అభ్యర్థి 10వ తరగతి ఉత్తీర్ణులై, 2025 జులై 1 నాటికి 21 నుండి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని పేర్కొన్నారు. 21 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు లేకుంటే 18 సంవత్సరాలు నిండిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశించిన అర్హతలు, ప్రాధాన్యతలకు సంబంధించిన ధ్రువపత్రాలను దరఖాస్తుకు జతపర్చితే అర్హత కొరకు పరిశీలించబడుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు మౌలిక పరీక్ష తేదీ, స్థలం తెలియజేస్తామన్నారు. మండల రెవెన్యూ అధికారి జారీ చేసిన నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్ కార్డు వంటి వాటి జెరాక్స్ కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్ చేత అటస్టేషన్ చేయించిన రెండు సెట్లు, రెండు ఫోటోలు దరఖాస్తుకు జత చేసి కార్యాలయం ఇవ్వాలని తెలిపారు. మరింత సమాచారం కోసం రంపచోడవరం ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రజాశక్తి -అనంతగిరి: ఐసిడిఎస్ ప్రోజెక్టు పరిధిలో అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ సంతోష కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సహాయకురాలుగా పులుసుమామిడి, బొరజుల పెద్దకోనెల, వాలసిలో మినీ అంగన్వాడి పోస్ట్ భర్తీ చేస్తామన్నారు.

ముంచింగిపుట్టు: మండలం పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు-2, మినీ అంగన్వాడీ కార్యకర్తలు-3, ఆయాలు - 3 మరియు పీఎం జనమన్ స్కీంలో కొత్తగా మంజురైన అంగన్వాడీ కేంద్రాల్లో ఆయాలు 3 పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో ఎం.వరహాలమ్మ తెలిపారు. పోస్టుల వివరాలు అంగన్వాడి కార్యకర్త - జోడిగుమ్మా, మద్దులబంధ మినీ అంగన్వాడి కార్యకర్త తలబిరాడ, రాంపుట్టు, కుర్రాయిపుట్టు అంగన్వాడి సహాయకురాలు - పట్నపడలపుట్టు, దేగలపుట్టు, గాజులబంద పీఎం జన్మన్ పథకం కింద కొత్తగా మంజూరు అయిన అంగన్వాడి సహాయకూరాలుగా ఎదుకొండాలబంధ, బంగరుపల్లె, బల్లయిబిరు/ మల్లెపొదరు అంగన్వాడి కేంద్రాల నుండి అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 26 నుంచి వచ్చే నెల 10లోగా ముంచంగిపుట్టు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు

చింతపల్లి : తాజంగి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలుకె. సుమమాధురి తెలియజేశారు. ఈ ఖాళీ సీట్ల వివరాలను ఆమె వెల్లడించారు. 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 1 సీటు, 9వ తరగతిలో 1 సీటు, ఇంటర్మీడియట్ (ఎంఈసి గ్రూప్)లో 40 సీట్లు ఉన్నాయన్నారు. విద్యార్థినులు ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ కెవికె.నాగసంతోషి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతి 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం సిఇసి గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని, వీటితో పాటు ఎనిమిదో తరగతిలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8639574485, 9701226759, 8333843797, 7780480062 నెంబర్లకు కాల్ చేసి సంప్రదించాలని కోరారు.

గురుకులాల ప్రవేశ దరఖాస్తుకు 9 వరకు గడువు పెంపు

ప్రజాశక్తి-సీలేరు : ఆంధ్ర ప్రదేశ్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి సంబంధించి దరఖాస్తు చేసుకొని గడువు ఏప్రిల్ నెల 9వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించినట్లు జీకే వీధి మండలం సీలేరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి చదివిన విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రం, చదువుకున్న పాఠశాల పేరు మీడియం తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440960780 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ధ్రువపత్రాల జారీలో జాప్యం వద్దు

ప్రజాశక్తి- చింతపల్లి: మండలంలోని ప్రజలకు ఇబ్బంది లేకుండా జనన, మరణ, కులం, పెళ్లి ధృవపత్రాలను సమయానికి అందించాలని తహశీల్దార్ రవి కుమార్, ఎంపిడిఓ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కార్యదర్శులు, విఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్ లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు తక్షణ సేవలు అందించాలని వారు సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, విఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్ లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా జనన, మరణ, కులం, పెళ్లి ధృవపత్రాల మంజూరును వేగవంతం చేయాలన్నారు. అవసరమైన రికార్డులు సమగ్రంగా నిర్వహించి, ఆన్‌లైన్ విధానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పాడేరు: పిఎంఇజి పథకం రుణాలకు మైనారిటీల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏ.పి.ఎస్.యం.ఎఫ్.సి కార్యనిర్వాహక సంచాలకులు సున్నిసా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకము కింద లబ్దిపొందుటకు జిల్లాలోని మైనారిటీ ముస్లిములు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు, బౌద్ధులు మరియు పారశీకుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.ఈ పథకము కింద తయారీ రంగానికి రూ.50 లక్షలు, సేవ రంగానికి రూ. 20 లక్షలు గరిష్టంగా ఋణం లభిస్తుందన్నారు. ప్రాజెక్టు ఏర్పాటు చేయు ప్రాంతము, లబ్దిదారుల వర్గీకరణను బట్టి కేంద్ర ప్రభుత్వముచే ప్రాజెక్టు విలువలో 15 శాతము నుండి 35 శాతము వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. లబ్దిదారుల ఎంపిక విధానము జిల్లా స్థాయిలో పథకము అమలుపరచు సంస్థ లైన, జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా ఖాదీ బోర్డు, ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ద్వారా సంబంధిత బ్యాంక్ వారితో సంప్రదించి స్కోరింగ్ విధానం ద్వారా లబ్దిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ పథకము నందు ఋణము కొరకు ధరఖాస్తు చేయగోరు మైనారిటీ అభ్యర్థులు కనీస వయస్సు 18 ఏళ్లు. దాటి ఉండవలెనన్నారు. తయారీ రంగంలో రూ. 10లక్షలు పైబడిన ప్రాజెక్టులు, సేవా రంగములో రూ.5లక్షలు పైబడిన ప్రాజెక్టుల స్థాపనకు అభ్యర్థులు కనీసం 8 వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్ సైటు లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9849901159, 9441716209, 0891 2502271 నంబర్లలో సంప్ర దించ న్నాలన్నారు.

విద్యార్థినిని పరామర్శిస్తున్న టిడిపి నాయకుడు

విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి అనంతగిరి: విద్యార్థుల ఆరోగ్య సమస్యల పట్ల పాఠశాల హెచ్ఎం, వార్డెన్‌లు పట్టించుకోకపోవడంపై తల్లిదండ్రులు, టిడిపి నాయకులు మండిపడ్డారు మండలంలోని బాలికల పాఠశాల 1 లో ఏడో తరగతి చదువుతున్న కిమిడి దివ్య అనే విద్యార్థిని ఆస్వస్థతకు గురైంది. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు అరకువేలి ఏరియా ఆసుపత్రిలో వైద్యం కోసం చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి మండల నాయకులు టి.ఆనంద్ బుధవారం సందర్శించి విద్యార్థిని ఆరోగ్య సమస్యల పట్ల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు

ధారాలమ్మ వార్షికోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు: జికె.వీధి మండలం ధారకొండ ఘాట్ రోడ్లో వెలసిన ధారాలమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవం బుధవారం ప్రారంభమైంది. జాతరకు దేవాదయ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ప్రధాన పండుగ ఈనెల 29న నిర్వహిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పటికే ధారాలమ్మ అమ్మవారి గరగలు సీలేరు పరిసర ప్రాంతాల్లో ఊరేగిస్తున్నారు. బుధవారం అమ్మవారి కలశ స్థాపన ఎండోమెంట్ అధికారి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 27న అమ్మవారి చిన్న జాగారన, 29న ప్రధాన పండుగ నిర్వహిస్తారు. దాతలు ఆర్థిక సహాయంతో ఈనెల 26 నుంచి 30 వరకు అమ్మవారి సన్నిధిలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పలు సాంస్కృతి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆంధ్ర, ఒరిస్సా, తెలంగాణ, చతీష్‌గడ్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానున్న తరుణంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా దేవాదాయ శాఖ చర్యలు చేపడుతుంది.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం, నడింపాలెం పంచాయితీ పరిధి గాము కొండ, కంపు రేగుల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని టిడిపి ఎస్‌టి సెల్ మండల ప్రధాన కార్యదర్శి జంపా వెంకట రమణ టిడిపి పాడేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు గిడ్డి ఈశ్వరి స్వగృహం వద్ద బుధవారం నిర్వహించిన కార్యకర్తే అధినేత కార్యక్రమంలో ఆమెను కలిసి విన్నవించారు. అల్లూరి సీతారామరాజుకు ఆశ్రయం ఇచ్చిన గాము కొండ చరిత్ర కలిగిన గ్రామమని, ఈ రోజుకీ ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని తెలిపారు. కంపురేగుల గ్రామానికి బ్రిడ్జి మంజూరు చేయాలన్నారు. దీనికి స్పందించిన ఈశ్వరి అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నడింపాలెం నాయకులు పనసల రాంబాబు, మాజీ సర్పంచ్ సుమర్ల సాంబశివరావు, రమాదేవి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నేతలు

వేతన వ్యత్యాసం లేకుండా చూడాలి

విద్యుత్ సబ్‌స్టేషన్ల న్యూ షిఫ్ట్ ఆపరేటర్ల నిరసన, వినతి

ప్రజాశక్తి- సీతమ్మధార : గత ప్రభుత్వ హయాంలో 33/11 కెవి సబ్‌స్టేషన్లలో నియమింపబడిన షిఫ్ట్ ఆపరేటర్లకు సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలని కోరుతూ సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద న్యూ షిఫ్ట్ ఆపరేటర్స్ నిరసన చేపట్టారు. అనంతరం ఫైనాన్స్ హెడ్, అర్‌డి డైరెక్టర్ డి.చంద్రానికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని అఇన్న జిల్లాల్లో దాదాపు రెండు వేలమంది షిఫ్ట్‌ఆపరేటర్లుగా నియమితులుకాగా, పాత ఆపరేటర్ల వేతనాలు వర్తింప చేయకుండా, గత ప్రభుత్వం ఎపిసిఒఎస్ జిఒ ద్వారా వేతనాలు నిర్ణయించడంతో ప్రస్తుతం రూ.18,500 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. పాత ఆపరేటర్లకు రూ.27,953 వేతనం ఇస్తుండగా, తమకు దాదాపు రూ.పది వేలు వేతన వ్యత్యాస ఉండడం దారుణమన్నారు. ఒకే సబ్‌స్టేషన్లో ఒకే రకమైన డ్యూటీ చేస్తున్న ఆపరేటర్స్ మధ్య వేతన వ్యత్యాసం సరిచేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అధికారులు, మంత్రుల చుట్టూ తిరిగి మొర పెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వేతనాలు పెంపులో కొత్త, పాత అనే తారతమ్యం లేకుండా చూశారని, ఇపుడు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

తరలిపోతున్న కలప

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో నుంచి కలప విచ్చలవిడిగా తగిలి పోతుంది. కలప అక్రమ రవాణాతో చెట్లు నరికేయడంతో పచ్చదనం కనుమరగవుతోంది. గసభ పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల్లో రెండు వారాలుగా కలప తరలిపోతుంది. గిరిజనులను ఆసరాగా చేసుకుని ప్రైవేటు వ్యక్తులు కలపను మైదాన ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు. కొండకోనల్లో పచ్చదనం కనుమరగవుతోందని గిరిజనులు అంటున్నారు. గిరిజనులు సాగు చేసిన తోటల కలప విక్రయాలకు సంబంధిత అటవీశాఖ అనుమతులు పొందాల్సి ఉంటుంది. ప్రైవేటు వ్యక్తులు అనుమతులు తీసుకోకుండా కలపను అక్రమంగా తరలించుకు పోతున్నట్లు తెలిసింది. ఈ విషయంపై అరకు డివిజన్ అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా నీలగిరి చెట్లను గిరిజనులు వారి తోటల్లో సాగు చేస్తున్నారని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గిరిజనులు అనుమతులకు దరఖాస్తులను పెట్టుకుంటున్నారన్నారని చెప్పారు. విఆర్వో, తహసీల్దార్ నివేదికను పూర్తిగా పరిశీలించిన పిదపనే అనుమతులు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రైవేటు వ్యక్తులు అక్రమ మార్గంలో కలపను తరలిస్తే ఆటువంటి వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వాహనాల్లో తరలిస్తున్న కలప

ప్రజా సంకల్ప వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి

నరసింహమూర్తి

ప్రజాశక్తి-చింతపల్లి : విశాఖపట్నం వేదికగా ప్రజా సంకల్ప వేదిక సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రంగసాయిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమాచార హక్కుచట్టం (ఆర్‌టిఐ)కు అనుబంధంగా పనిచేస్తున్న ప్రజా సంకల్ప వేదిక సొసైటీకి అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా చింతపల్లి మండల కేంద్రానికి చెందిన పంపాన నరసింహమూర్తి నియమించ బడ్డారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని నియమించారు. అందులో భాగంగా అల్లూరి జిల్లాకు ప్రధాన కార్యదర్శిగా మూర్తిని నియమించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రజా సంకల్ప వేదిక సొసైటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమానికి తన తోటి సభ్యులతో కలిసి అంకితభావంతో పని చేయనున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతంలో ప్రజలు తమ హక్కులను పూర్తిగా ఉపయోగించుకోవాలంటే, సమాచార హక్కు చట్టంపై స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. ప్రభుత్వ వ్యవహారాలపై ప్రశ్నించే హక్కును ఈ చట్టం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పౌర హక్కుల పరిరక్షణకు కృషి చేయడం, అవినీతి వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

అంగన్వాడీ కార్యకర్త నియామకం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల పరిధిలో ముంచంగిపుట్టు సెక్టార్‌కు చెందిన జర్రెల పంచాయతీ దేగలపుట్టు గ్రామ అంగన్వాడి కేంద్రంలో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న తలారి శ్రీదేవిని అంగన్వాడి కార్యకర్తగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మండల ఐసిడిఎస్ సిడిపిఓ వరహాలమ్మ తెలిపారు. మండల కేంద్రంలో పదోన్నతి పత్రాన్ని బుధవారం శ్రీ దేవికి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ, అంగన్వాడి కార్యకర్త నవంబర్ నెలలో అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో ప్రమోషన్‌కు ప్రభుత్వానికి సిఫార్సు చేయగా ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. హెల్పర్ కు సుమారు 8 సంవత్సరాల సర్వీసు తోపాటు , విద్యార్హత కలిగి ఉండడంతో ఆమెకు అంగన్వాడి కార్యకర్తగా పదోన్నతి కల్పించిందన్నారు. దేగల పుట్టు అంగన్వాడి కేంద్రంలో హెల్పర్ పోస్ట్ భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామని, 21 సంవత్సరం నుండి 35 సంవత్సరాల లోపు వయోపరిమితి కలిగిన అభ్యర్థులు పదవ తరగతి ఉత్తర్ణితులైయుండి ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకొనుటకు అర్హులని పేర్కొన్నారు.

నియామక పత్రాన్ని అందిస్తున్న సిడిపిఓ వరహాలమ్మ

పదార్థ విజ్ఞాన శాస్త్ర అన్వేషణలో కృత్రిమ మేధ

గీతంలో కేంబ్రిడ్జి యూనివర్సిటీ పరిశోధకుడు అభిషేక్ అగర్వాల్

ప్రజాశక్తి-మధురవాడ : వివిధ రంగాలకు అవసరమైన నూతన పదార్థ విజ్ఞానాన్ని శోధించడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర వహిస్తోందని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం పరిశోధకుడు అభిషేక్ అగర్వాల్ అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆటో మొబైల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ పదార్థ విజ్ఞానం పై జరిగే పరిశోధనలలో సత్వర ఫలితాలకు సంప్రదాయ పద్ధతుల కంటే కృత్రిమ మేధ అత్యంత వేగవంతమైన సమాచారం అందించగలదన్నారు. వైద్య, పారిశ్రామిక, వైమానిక, ఆటోమొబైల్ రంగాలలో నూతన పదార్థాలను వెలుగులోకి తేవడం ఎంతో అవసరమని, దీన్ని దృష్టిలో పెట్టుకుని కృత్రిమ మేధ సహాయంతో మెటీరియల్ సైన్స్ పరిశోధకులు అధ్యయనాలు చేస్తున్నారని వివరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ వంటి కోర్సుల అభ్యసించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అయితే సబ్జెక్టుపై పట్టు, లోతైన అవగాహన నూతన అవకాశాలకు మార్గం చూపుతాయన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ కృత్రిమ మేధ ప్రయోజనాలు కంప్యూటర్ సైన్స్‌కు మాత్రమే పరిమితం కాదని మెకానికల్, సివిల్ తదితర రంగాలలో సహితం విస్తరిస్తున్నాయన్నారు గీతం కోర్ ఇంజనీరింగ్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఎ.కె.ప్రసాదరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు పైథాన్ కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు స్టాటిస్టిక్స్‌పై పట్టు ఉంటే కృత్రిమ మేధలో అద్భుతాలు సృష్టించవచ్చునన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ రాజేశ్వరరెడ్డి, గీతం మూర్తి ప్రయోగశాలల విశిష్ట ప్రొఫెసర్ బివిఆర్.టాటా పాల్గొన్నారు.

అభిషేక్ అగర్వాల్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

సిఐటియు పోరాట విజయం

సమ్మె ఒప్పందాల అమలుపై విశాఖ డెయిరీ కార్మికుల హర్షం


మాట్లాడుతున్న యూనియన్ నేత రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి -గాజువాక : సిఐటియు పోరాట ఫలితంగా విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కారమై, నేడు కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందని విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు మాజీ అధ్యక్షులు ఎన్ రాజేంద్రప్రసాద్ అన్నారు. గతేడాది డిసెంబర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేయగా, 20 డిమాండ్లలో 19 అమలుకు అప్పట్లో విశాఖ డెయిరీ యాజమాన్యం లిఖితపూర్వకంగా అంగీకరించింది. అయితే చేసుకున్న ఒప్పందాల అమలుకు తర్వాత కూడా యూనియన్ తరపున పోరాటం కొనసాగించడంతో బుధవారం నుంచి అవన్నీ కార్యరూపంలోకి వచ్చాయని రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. కనీస వేతనం రూ.21వేలు, బేసిక్ ఐఆర్ఎఫ్ ఏడు శాతం, ఫిక్స్‌డ్ డిఎ ఐదు శాతం, హెచ్‌ఆర్ఎ 15శాతం, ఒప్పంద కార్మికులు 426 మందిని పర్మినెంట్ చేయడం, బల్క్ కోల్డ్ ఆపరేటర్లకు వారాంతపు సెలవు, 8 గంటల పని దినాలు, ఓటి సదుపాయం, అర్హత కలిగిన ఉద్యోగులకు 50శాతం ప్రమోషన్ కల్పన, 2005 ఏప్రిల్ ఒకటి నుంచి ఎల్‌పిసి అమలు, ఏడాదికి 25 చొప్పున ఇఎల్‌లు, సిఎల్‌లు, పది సిగ్గు సెలవులు, ఉద్యోగ విరమణ వయస్సు 58 నుంచి 60ఏళ్లకు పెంపు, విధుల్లో చనిపోయిన వారికి నష్టపరిహారం చెల్లింపు వంటి ఒప్పందాలన్నీ బుధవారం నుంచి యాజమాన్యం కార్యరూపంలోకి తెచ్చిందన్నారు చేసుకున్న ఒప్పందాలన్నీ అమలు చేయడంపై డెయిరీ యాజమాన్యానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కె వరాహమూర్తి, సతీష్ కుమార్ నారాయణ, కె.జగదీశ్వర రావు, ఆ అప్పారావు, కెవిన్ వెంకట్రావు, ఎల్‌విఎం నాయుడు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి- ఆనందపురం: గ్రామాల్లో జరుగుతున్న భూసర్వే అధికారులకు రైతులు సహకరించాలని భీమిలి రెవెన్యూ డివిజన్ అధికారి సంగీత్ మాధుర్ అన్నారు. బుధవారం మండలంలోని గిడిజాల గ్రామంలో భూ రీసర్వే పై తహశీల్దార్ శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. రైతులు ఏ విధమైన అపోహలకు లేకుండా, నిర్భయంగా, స్వేచ్ఛగా తమ భూములు సరిహద్దులు చూపించి రెవెన్యూ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిఐఒ కొండలరావు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్. గోవింద్, మండల సర్వేయర్ అప్పన్న, స్థానిక విఆర్ఒ జి. దేవరాజ్, సర్పంచ్ అప్పల రాజు, మాజీ సర్పంచ్ కోరాడ రాము, రీ సర్వే సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వెయ్యర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్

నేరాలు ఘోరాలు

ద్విచక్రవాహనాల ఢీ

ప్రజాశక్తి-చింతపల్లి : రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొని పలువురు గాయపడ్డారు. బుధవారం చింతపల్లిలో పదవ తరగతి విద్యార్థులు ఉల్లి పవన్, నవదుర్గ, ఉల్లి బన్నీలు పది పరీక్షలు రాసిన అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామం గాదిగొయ్యి బయలుదేరారు. ముగ్గురు విద్యార్థులు ద్విచక్ర వాహనం చిన్నగెడ్డ వద్దకు వచ్చే సరికి ఎదురుగా మరో ద్విచక్ర వాహనం లో లకే మత్సకొండ, నారాయణమ్మలు చింతపల్లి వస్తున్నారు. చిన్నగెడ్డ వద్ద ఎదురురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు బలంగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు విద్యార్థులకు, మరో వాహనం ను నారాయణమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తులకు వైద్యులు ప్రథమ చికిత్సను అందించారు. నారాయణమ్మకు గాయాలయ్యాయి.

28న జాబ్‌మేళా

ప్రజాశక్తి - పాడేరు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి .పి.రోహిణి ఒక ప్రకటన లో తెలిపారు.ఈ జాబ్ మేళా లో మదర్ ఫాదర్ హెల్త్ కేర్ సర్వీసెస్, మీషో , దేవి ఫిషరీస్ ప్రైవేటు లిమిటెడ్ లో కొలువులు వున్నట్లు తెలిపారు. దీనికి పదవ తరగతి, ఏఎన్ఎం మరియు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి వున్న 18 నుండీ 40 సంవత్సరాలు గల నిరుద్యోగ యువతీ యువకులు స్థానిక పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తను చదువుకున్న ధ్రువ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 6302636174 లేదా 9949927899 నెంబరులను సంప్రదించ వచ్చని తెలిపారు.

స్థానిక సంస్థల ఉపఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లాలో రెండు మండల పరిషత్తులు, ఒక గ్రామ పంచాయతీలో ఏర్పడిన ఆకస్మిక ఖాళీలకు ఉపఎన్నికల నిర్వహణ నిమిత్తం రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ నెం. 35 మేరకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత యం.పి. డి .ఓ లను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. రాజీనామాలతో ఖాళీ అయిన జి.మాడుగుల మండల అధ్యక్ష పదవికి, గెమ్మెలి పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి, చింతూరు మండల కో-ఆప్షన్ సభ్యులు పదవికి ఎన్నికలకు ప్రీసైడింగ్ అధికారులుగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పథక సంచాలకులు విద్యా సాగర్ , అరకు ఈఓఆర్డీ సత్యనారాయణ, రంపచోడవరం డి.యల్.డి.ఓ కోటేశ్వరరావు లను నియమించారు. జి.మాడుగుల మండలంలో 13 మంది యం.పి.టి.సి సభ్యులు,చింతూరు మండలంలో 12 మంది యం.పి.టి.సి సభ్యులు, గెమ్మెలి పంచాయతీ లో 14 మంది వార్డ్ సభ్యులకు, సర్పంచ్ కు ఈ నెల 23 వ తేదీన ఎన్నికల నోటీసులు జారీ చేశారు. 27 న ఉదయం ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, చేతులు ఎత్తడం ద్వారా ఆయా మండలాల యం.పి.టి.సి సభ్యులు మండల అధ్యక్షులను /కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకొంటారు. సర్పంచ్ వార్డు సభ్యులు కలసి గెమ్మెలి పంచాయతీ ఉప సర్పంచ్ ను ఎన్నుకొంటారు. పోటీ చేసే అభ్యర్థులకు సమానమైన ఓట్లు వస్తే లాటరీ విధానంలో విజేతను ప్రకటిస్తారు.

అకారణంగా సస్పెండ్ చేశారు

- పంచాయతీ కార్యదర్శి నమిహ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అనకాపల్లి మండలం రేబాక గ్రామ రిసోర్స్ పర్సన్‌గా ఉద్యోగ బాధ్యతలో ఉన్న తనను అకారణంగా సస్పెండ్ చేశారని, అనంతరం పాయకరావుపేట మండలం ఈదటం గ్రామ కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై పంపించారని, అక్కడ కూడా సక్రమంగా ఉద్యోగం చేయనివ్వకుండా ఉన్నత అధికారులు సస్పెండ్ చేసి, ఆఖరికి ఉద్యోగం నుంచి తొలగించినట్లు ప్రకటించి తనను, తన కుటుంబాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారని పంచాయతీ కార్యదర్శి నమిహ చెప్పారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తనకు జరిగిన అన్యాయం గురించి అనకాపల్లి జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులకు తాను లిఖితపూర్వకంగా అభ్యర్థనలు సమర్పించి, సస్పెన్షన్ ఎత్తివేయాలని, తిరిగి తనకు ఉద్యోగం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో సహా పలువురు ఐఎఎస్ అధికారులు తన పట్ల అవమానకరంగా, హేళనగా మాట్లాడి మానసిక క్షోభకు గురిచేశారని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదన్నారు.

వలకు చిక్కిన గెలాస్కోపి చేప

ప్రజాశక్తి-సీలేరు: ఆంధ్ర ఒడిశా సరిహద్దు బలిమెల రిజర్వాయర్‌లో బుధవారం వేటకెళ్లిన మత్స్యకారుల వలలకు గెలాస్కోపి జాతికి చెందిన 12 కిలోలు పైగా ఉండే భారీ చేప చిక్కింది. దీంతోపాటు బంగారు పాప, ఇతర జాతికి చెందిన మరికొన్ని చేపలు లభ్యమయ్యాయి. వీటిని సీలేరు చెందిన బంగారు శెట్టి అనే వ్యాపారి మత్స్యకారుల వద్ద నుంచి కొనుగోలు చేసి సీలేరులో విక్రయించారు. గెలాస్కోపీ రకానికి చెందిన చేప కొనుగోలు చేసేందుకు స్థానికులు ఎగబడ్డారు. కిలో రూ.240కి విక్రయించిన కొనుగోలు చేసేందుకు ఎవరూ వెనకాడ లేదు. గెలాస్కోపి రకానికి చెందిన చేప హిమాలయాల్లో దొరుకుతాయి. ఈ చేపలో ఔషధ గుణాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ చేప అరుదుగా లభ్యమవుతాయి. ఇంతకుముందు సీలేరు నదిలో గెలాస్కోపీ రకానికి చెందిన చేపలు లభ్యమయ్యాయి. ఈ ప్రాంతంలో లభ్యమైన గెలాస్కోపీ రకానికి చెందిన చేపలను గతంలో నిపుణులు కొనుగోలు చేసి పరిశోధనలు చేయగా ఔషధ గుణాలు కలిగి ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు.

వ్యాపారి వలకు చిక్కిన గెలాస్కోపి చేప

ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ

గుడ్లపల్లిలో డ్రెయినేజీ సమస్య

గుడ్లపల్లిలో నిలిచిన మురుగునీరు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని గుడ్లపల్లి గ్రామంలో వీధి కాలువలు సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతుంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు నిల్వ వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డ్రెయినేజీలు నిర్మించాలని, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయితీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

జీవరాశుల సంరక్షణ బాధ్యత మానవాళిదే

ప్రజాశక్తి- ములగాడ : జీవరాశుల సంరక్షణ బాధ్యత మానవాళి చేపట్టాలని కేంద్ర పరిశ్రమల రక్షణ విభాగం (సిఐఎస్ఎఫ్) డిప్యూటీ కమాండెంట్ ప్రిషాబ్ దేవాంగన్ అన్నారు. బుధవారం మల్కాపురం సిఐఎస్ఎఫ్ కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ నేతృత్వంలో పక్షులు, వన్యప్రాణులకు నీరు, ఆహారానికి ధాన్యం కంకుల కుచ్చులు అందుబాటులో ఉంచారు. . ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో పక్షులు, వన్య ప్రాణులకు తాగునీరు, ధాన్యం, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు ఆహారం అందుబాటులో ఉంచడం బాధ్యతగా చేపట్టాలని సూచించారు. భావితరాలకు పిచ్చుకలు వంటి జీవరాశులను చూపాలంటే వాటిని సంరక్షించాల్సి అవసరం ఉందన్నారు..అసిస్టెంట్ కమాండెంట్ అరవింద్ కుమార్ శర్మ,.సిఐఎస్ ఎఫ్ అధికారి సందీప్ కుమార్, సంస్థ అధికారి సయ్యద్, సంరక్షిక సంస్థ అధ్యక్షురాలు షీలూ జైన్ , గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం , మురళి పాల్గొన్నారు.